# ప్రతి వైసిపి కార్యకర్తకు పార్టీ అండ

**– జడ్పీటిసి సభ్యులు సూరిబాబు, మండల కన్వీనర్ శ్రీను రాజు**



**టి.నర్సాపురం,మేజర్‌న్యూస్:** ప్రతి వైసిపి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని జడ్పీటిసి సభ్యులు సామంత పూడి బాల సూర్యనారాయణ రాజు (సూరిబాబు), వైఎస్ఆర్ సిపి మండల కన్వీనర్ శ్రీను రాజు అన్నారు. మండల కేంద్రమైన టీ నర్సాపురంలో బుధవారం పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను సూర్యనారాయణ రాజు ఆవిష్కరించారు. వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్‌చేసి వేడుకను నిర్వహించారు. జైజగన్ వైయస్సార్ జోహార్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక సర్పంచ్ సునంద,రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు,దేవరపల్లి ముత్తయ్య,ఎంపీపీ దార బోయిన లక్ష్మి వెంకటేశ్వర రావు,వంటిపల్లి సుబ్రమణ్యం,కాలనీడి సుబ్బారావు బోళ్ళ రంగారావు,దాకారపు సూర్యారావు, నల్లూరి శ్రీనివాస్,కుర సం నిరీక్షణ రావుతో పాటు అధిక సంఖ్యలో వైఎస్ఆర్సిపి అభిమానులు పాల్గొన్నారు.


నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతం
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,13 మార్చి 2025 | 8 పేజీలు


## దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా

# పిజిఆర్ఎస్ పిటిషన్లు పరిష్కారం





**– సిఎం కార్యాలయం నుండి ఐవిఆర్ఎస్ సర్వే**

**– దరఖాస్తుదారుడి పట్ల మర్యాదగా ప్రవర్తించాలి**

**ఏలూరు,మేజర్‌న్యూస్:**దరఖాస్తుదారుడు సంతృప్తి చెందులా పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం విధానం ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తహసీల్దార్ లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం,రాష్ట్రమంత్రులు,ఎమ్మెల్యే,తదితర ప్రజాప్రతి నిధుల నుండి అందిన దరఖాస్తుల పరిష్కార అంశంపై ఆర్డీఓ, తహ శీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరాల వారి వద్ద నుండి అందిన ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అర్హత లేని దరఖాస్తులను తిప్పి పంపుతూ అందుకు గల కారణాలను స్పష్టంగా ధరఖాస్తుదారునికి, సదరు ప్రజాప్రతినిధికి తెలియజేయాలన్నారు. దరఖాస్తు అందిన తరువాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారా,పరిష్కారవిధానం,అధికారుల ప్రవర్తన,తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఫిర్యాదీదారుడితో ఐవిఆర్ఎస్ విధానంలో ఫోన్ ద్వారా ప్రజల స్పందనను అడిగి తెలుసుకుంటారని, అధికారుల ప్రవర్తన, నడవడిక, జవాబుదారీతనం తదితర అంశాలను కూడా అడిగి తెలుసుకుంటారన్నారు.సమస్యలపరిష్కారం కోసం మండల రెవిన్యూ కార్యాలయాలకు వచ్చే


- తరువాయి 2లో..


## ఢిల్లీలో కేంద్రమంత్రి భూపతిరాజుకి

# తప్పిన పెను ప్రమాదం..

**- పార్లమెంట్ సమావేశానికి హాజరై తిరిగి వస్తుండగా కారును ఢీకొట్టిన మరో కారు**



**ఢిల్లీ,మేజర్‌న్యూస్ :** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ సమావేశానికి హాజరైన అనంతరం భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యాలయానికి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వెళు ండగా విజయ్ చౌక్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస వర్మ కాలికి తీవ్ర గాయమైంది. కేంద్ర మంత్రి కార్యాలయంలో వైద్య బృందం శ్రీనివాస వర్మ కు ప్రత్యేక చికిత్స అందించారు. కాలికి బలమైన గాయం కావడం వల్ల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అయితే నరసాపురం పార్లమెంట్ పరిధిలో గురువారం పలు కార్యక్రమాల్లో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పాల్గొనవలసి ఉండటంతో ఢిల్లీ నుంచి భీమవరంకి ఆయన బయలుదేరారు.

## జాతీయ రహదారిపై

# మరో బస్సు ప్రమాదం

**- 15 మందికి గాయాలు**






**పెదపాడు,మేజర్‌న్యూస్ :** పెదపాడు మండలం కలపర్రు టోల్గేట్ నుండి ఆశ్రం ఆసుపత్రి మధ్యలో జాతీయ రహదారిపై వరుస రోడ్డు ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు రెండు ప్రైవేటు ట్రావెల్ బస్సులు బోల్తా పడిన సంఘటన ఇంకా మరువక ముందే తాజాగా బుధవారం తెల్లవారుజామున కలపర్రు టోల్ గేటు సమీపంలోని రామచంద్ర కాలేజీ వద్ద లారీని తప్పించబోయి ఆర్టిసి బస్సు వెనుక నుండి ఢీకొంది. ప్రమాదం జరిగే సమయంలో ఆర్టిసి బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉండగా గాయాల పాలైన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏలూరు ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. బస్సు కాకినాడ నుండి గుంటూరు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

## ఏప్రిల్‌లోగా ఇళ్ల నిర్మాణాలు

# పూర్తి చేసుకున్న వారికి అదనపు లబ్ధి





**– ఎస్సీలు, బీసీలకు రూ.50వేలు,ఎస్టీలకు రూ.75వేలు**

**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**తణుకు,మేజర్‌న్యూస్:** ఎస్టీ,ఎస్టీ,బీసీ లబ్ధిదారులకు గృహ నిర్మాణాలలో ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాడ తెలిపారు. బుధవారం తణుకు మండలం వేల్పూరు లేవుట్ ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేసి, గృహ నిర్మాణాలు చేపట్టినవి ఎన్ని, చేపట్టాల్సినవి ఎన్ని, ప్రారంభించి పునాది దశలో ఉన్నవి ఎన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది ఉన్నారు, వారికి చేపట్టిన గృహ నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయి ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీలోని బీసీ లబ్ధిదారు నల్లి అన్నపూర్ణ, ఎస్సీ లబ్ధిదారు పంతగాని మంగ, తదితర లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ స్వయంగా మాట్లాడి గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక లబ్ధిని వివరించారు. పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌లో ఇల్లుమంజూరైఇంకనూ వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్


- తరువాయి 2లో..

# పేదలకు విద్యను దూరం చేసే వ్యక్తం




## కూటమి ప్రభుత్వం కుటిలయత్నం : వైసీపీ నేతల ధ్వజం

**ఏలూరు, మేజర్ న్యూస్:** పేదలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర కూటమి ప్రభుత్వం చేస్తూ ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నేతలు ఫీజు పోరు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ, ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై అసత్య ప్రచారం చేస్తూ కూటమి ప్రభుత్వం చిన్న సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే, వాటిని ఇప్పుడు ప్రైవేటీకరణ చేసి, పేదలకు సీట్లు రాకుండా చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కుటిలయత్నం చేస్తోందన్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఫీజులు బకాయిలు చెల్లించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, విద్యార్థులకు మౌలిక వసతులు దూరం చేసిందని విమర్శించారు. దగా కోరు ప్రభుత్వం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంటు ఇంచార్జ్ కారుమూరి సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మేక ప్రతాప్ వెంకట అప్పారావు,తెల్లం బాలరాజు, నియోజకవర్గ ఇన్చార్జులు మామిళ్ళపల్లి జయప్రకాష్, కంభం విజయ రాజు, ఇంకా పలువురు నేతలు, భారీ సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు.

# గిరిజన మహిళల ఇంటి స్థలాలకు దరఖాస్తులు స్వీకారం

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద గిరిజన మహిళలకు ఇంటిస్థలాలు ఏర్పాటు చేయుటకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్లో అన్ని మండలాల తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, మండల సర్వేయర్లు, మండ రెవిన్యూఇన్స్పెక్టర్లు,అన్ని మండలాలకు సంబంధించిన వీఆర్వోలతో నిరుపేద గిరిజన మహిళలకు ఇంటి స్థలాలు ఏర్పాటు చేయుట, రీ సర్వే గురించి చర్చించుట, నేషనల్ హైవే 516ఇ లో రోడ్డుకు ఇరువైపులా భూములు, ఇండ్లు, చెట్లు, ప్రభుత్వ భూములు నష్టపోయిన వాటిని నష్టపరిహారం చెల్లించే విధంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ జీవోలు నెంబర్ 367, 30,23 నిబంధనల ప్రకారం నిరుపేద మహిళలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు మంజూరు చేయుటకు ఒకటి నుండి ఏడు ఫారములు ఇంటి స్థలములు లేని దరఖాస్తుదారులు నింపిన తర్వాత మండలానికి సంబంధించిన అధికారులు యాప్‌లో అప్లోడ్ చేసిన అనంతరం జిల్లా కలెక్టర్‌వారికి అనుమతి కొరకుపంపడంజరుగుతుందనిఆయన అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరుపేద గిరిజన మహిళలకుఆధార్ కలిగి ఉన్న అదేవిధంగా ఏవిధమైన ఇంటి స్థలం లేని వారికి మూడు సెంట్ల ఇంటి స్థలం పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం మంజూరు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. నిరుపేదలను గుర్తించే విధంగాగ్రామ సభల ద్వారా తీర్మానాలు చేయించాలని ఆయన అన్నారు. నిరుపేద గిరిజన మహిళలకు బిపిఎల్ అయ్యుండి సంవత్సరానికి ఒక లక్ష 20 వేల రూపాయల ఆదాయం కలిగియున్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ఆయన అన్నారు. నేషనల్ హైవే 516ఇ సంబంధించిన బాధితులకు పూర్తిస్థాయిలో అన్ని పరిశీలించిన తర్వాతే మార్చి 31 నాటికి పెండింగ్ లో ఉన్న వాటిని పూర్తిచేయాలని ఆయన అన్నారు. మారేడుమిల్లి పరిసరాల ప్రాంతంలో అనుమతులు లేకుండా రిసార్ట్స్ ఏర్పాటు చేసే వారికి నోటీసులు జారీ చేయాలని ఆయన అన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ మాట్లాడుతూ ఇంటి స్థలములు లేని నిరుపేద గిరిజన మహిళలకు ఇండ్లు స్థలం ఏర్పాటు చేయుటకు వీఆర్వోలకు పది రకాలైన జీవోలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో ఒక కుటుంబంలోనీ యజమాని పేరు మీద ఉన్న భూములు వారసులు మ్యూటేషన్కు ఒక్కొక్క మండలంలో ఎన్ని చేసినవి ఇంకా ఎన్ని పెండింగ్లో ఉన్నవి ఆమె ఆరా తీశారు. ప్రతి మండలంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పోషణ్ అభియాన్ పథకం అమలు చేయుటకు దరఖాస్తు సమర్పించిన పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే మంజూరు చేయాలని ఆమె అన్నారు అదేవిధంగా ఒక్కొక్క మండలంలో బర్త్ సర్టిఫికెట్లు ఎన్ని పెండింగ్లో ఉన్నవి ఆమె ఆరా తీశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వ ఆర్డర్లు సంబంధిత తాసిల్దార్లు అందరు సిబ్బందికి తెలియజేయాలని ఆమె అన్నారు. 141 గ్రామాలకు సంబంధించిన ప్రభుత్వ భూముల జాబితా సమర్పించాలని ఆమె అన్నారు అదేవిధంగా మ్యూటేషన్ సంబంధించిన వివరాలు మండలాల వారికి సమర్పించాలని ఆమె అన్నారు. రీ సర్వేకి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిని లక్ష్మీ రమణి, తాసిల్దారులు పి.రామకృష్ణ, కరక సత్యనారాయణ, బాలాజీ, సిహెచ్ శ్రీనివాసరావు, కె.సూర్యనారాయణ, వేణుగోపాల్, ఏ సత్యనారాయణ, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, అన్ని మండలాలకు సంబంధించిన మండల సర్వేలు, డిప్యూటీ తాసిల్దారులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అన్ని మండలాలకు సంబంధించిన వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో చైర్ పర్సన్ సమీక్ష



**ఏలూరు, మేజర్ న్యూస్ :** జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన బుధవారం జడ్పీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ద్వారా మంజూరు చేయబడిన పంచాయతీ రాజ్ అభివృద్ధి పనుల పురోగతి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారి కనెక్టివిటీ ప్రాజెక్ట్ కింద చేపట్టిన రహదారి పనుల పురోగతి, ఇంకా జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో పెండింగ్‌లో ఉన్న పనులపై జెడ్పి చైర్ పర్సన్ సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ, "జిల్లాలో గ్రామీణ అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని, ప్రజలకు ప్రయోజనం కలిగేలా, ప్రణాళికా బద్ధంగా పనులు అమలు చేయాలన్నారు. అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.సమీక్షలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు: జిల్లాలో చేపట్టిన పంచాయతీ రాజ్ పనులపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరిపించాలాన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను వేగంగా పూర్తిచేయడంతో పాటు, కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవడం పి ఎం జి ఎస్ వై కింద రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడం ఈ సమీక్షలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా పిజిఆర్ఎస్ పిటిషన్లు పరిష్కారం

మొదటిపేజి తరువాయి

ప్రజలపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరన్ రాజ్, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఎస్డిసి భాస్కర్, జిల్లాలోని అన్ని మండలాలాల తహసీల్దార్లు, పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి అదనపు లబ్ధి

మొదటిపేజి తరువాయి

విలువకు అదనంగా ఆర్థిక సహాయంఅందించాలని ప్రభుత్వం సంకల్పించింద న్నారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఎస్సీలు, బీసీలకు రూ.50వేలు,ఎస్టీలకు 75,000రూపాయలుగృహ నిర్మాణాల కు అదనంగా ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీలు, బీసీలు అందరికీ రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగాఅందిస్తుందని తెలిపారు. అయితే వీటి నిర్మాణాలను ఏప్రిల్ 2025లోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తి చేసుకొనే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారన్నారని జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 18,340 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహాలు వివిధ దశలలో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నా యన్నారు.ఈసందర్భంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య,ఈఈ ఎం.శ్రీని వాస్. డిఈ కే కేడి టి ప్రసాద్, తహసిల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ, సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి,గృహ నిర్మాణశాఖ,సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

## క్లాప్స్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు

**– ప్యాడ్‌లు, పెన్‌లు పంపిణీ**

**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** బుధవారం పెద్దాపురం పట్టణంలోని క్లాప్స ఆధ్వర్యంలో సెక్రటరీ రెవ.నాగ శ్రీనివాస్ జేమ్స్ అధ్యక్షతన కల్వరి మిరాకిల్ చర్చ్ ప్రాంగణంలో క్లాప్ అధ్యక్షులు రెవ.జి.సత్యానందం, బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ రెవ.డా.జి.ఆర్.ఇమ్మానుయేల్ రాజు కుమారుడు పాస్టర్ జి.జాన్ మోజెస్ దాస్, ఉపాధ్యక్షులు ఎల్.జ్ఞానానందంల చేతుల మీదుగా పదవ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్సిల్స్, స్కేల్స్, ఎరెజర్స్, రబ్బర్స్, పెన్స్ పంపిణీ చేశారు.రెవ.డా.ఎన్.భాస్కం ˊరావు, వ్యవస్థాపకులు రెవ.డా.లంక పురుషోత్తమ దాస్, రీజనల్ మెంబర్ రెవ.చందూ స్టీఫెన్, కోశాధికారి బ్రదర్ ఎన్.సుకుమార్ సహాయం, రెవ.జి.జె.విల్సన్, పాస్టర్ వి.బాబూ ఇమ్మానుయేల్, పదవతరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు శిక్షణ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల అధ్యక్షులు గొల్లపల్లి నరసి ంహామూర్తి(బుజ్జి)గారు. శిక్షణా కార్యక్రమంను ఉద్దేశించి మాట్లా డుతూ ప్రస్తుతం దాల్వా సాగు కోత దశకు చేరుకున్నందున ధాన్యం కొనుగోలు సిబ్బంది అందరూ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి ప్రతీ రైతూ కనీస మద్దతు ధర పొందే విధంగా సహకరి ంచాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎం.ఎస్.ఒ జి.రవి,సివిల్ సప్లై డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఎస్.దుర్గాప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ సివిల్ సప్లై పి. నాగ ప్రసాద్, అన్ని గ్రామాల వి.ఆర్.ఓలు , రైతు సేవా కేంద్రాల ఇంచార్జులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

# విష్ణు డెంటల్ కాలేజ్‌కి బాంబు బెదిరింపు






**– అప్రమత్తమైన కాలేజీ సిబ్బంది,విద్యార్థుల్లో భయాందోళన**

**భీమవరం,మేజర్ న్యూస్ :** భీమవరం విష్ణు డెంటల్ కాలేజ్‌కి బుధవారం మధ్యాహ్నం బాంబు బెదిరింపు మెయిల్ సంచలనం సృష్టించింది. కాలేజీకి అనామక మెయిల్ రావడంతో కాలేజీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తక్షణమే పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం అందించడంతో పరిస్థితి ఒక్కసారిగా మారింది. బుధవారం మధ్యాహ్నం కాలేజీ అధికారులకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. మెయిల్‌లో కాలేజీలో బాంబు ఉంచినట్టు తెలియజేయడంతో కాలేజీ యాజమాన్యం అప్రమత్తమై విద్యార్థులను, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. విద్యార్థులను వేరే బ్లాకులకు తరలించి, తక్షణమే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే భీమవరం పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని కాలేజీని తమ అధీనంలోకి తీసుకున్నారు. బాంబ్ స్క్వాడ్ టీమ్ కాలేజీ ప్రాంగణాన్ని పూర్తిగా తనిఖీ చేశారు. ప్రాంగణంలోని ప్రతి గది, కారిడార్, ల్యాబ్,గ్రౌండ్ సహా ప్రతి మూలను జల్లెడ పట్టారు. ఈ తనిఖీలు సుమారు 7 గంటల పాటు కొనసాగాయి. తనిఖీల అనంతరం ఎలాంటి బాంబు ఆనవాళ్లు కనిపించకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనతో కాలేజీలో తీవ్ర కలకలం రేగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు ఈ బెదిరింపు మెయిల్ వెనుక ఎవరున్నారో తెలుసుకునే దిశగా దర్యాప్తు ప్రారంభించారు. మెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం రంగంలోకి దిగింది. త్వరలో నిజానిజాలు వెలుగులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో భీమవరం వాసుల్లో భయం నెలకొంది. కాలేజీ ప్రాంగణంలో పోలీసులు నిఘా పెంచారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భద్రతాపరమైన చర్యలపై కాలేజీ యాజమాన్యం వెంటనే స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సలహాలు, సూచనలు ఇవ్వండి



**ఏలూరుమేజర్ న్యూస్:** ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సూచనలు, సలహాలు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 31 లోపు రాజకీయ పార్టీలు తమ సూచనలను సంబంధిత వెబ్ సైట్ ద్వారా తెలియజేయవచ్చని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి పేర్కొన్నారు. చట్టపరమైన పద్ధతిలో ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి పరస్పర చర్య కోసం పార్టీ అధ్యక్షులు ,సీనియర్ నాయకులను ఎన్నికల సంఘం ఆహ్వానిస్తుందని జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటరు నమోదు అధికారి,జిల్లా ఎన్నికల అధికారి లేదా ముఖ్య ఎన్నికల అధికారి స్థాయిలో ఏవైనా పరిష్కరించని సమస్యల కోసం అన్ని జాతీయ,రాష్ట్ర రాజకీయ పార్టీల నుండి భారత ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. బుధవారం రాజకీయ పార్టీలకు జారీ చేసిన వ్యక్తిగత లేఖలో, కమిషన్ ఏర్పాటు చేసిన చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి,పరస్పర అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు ,పార్టీ సీనియర్ సభ్యులతో పరస్పర చర్చలను ఆశిస్తోందని తెలిపారు. ఇదివరలో, గత వారం భారత ఎన్నికల సంఘం కాన్ఫరెన్స్ సందర్భంగా,ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు, యూనియన్ టెర్రిటరీల ముఖ్య ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు,ఓటరు నమోదు అధికారులను రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా పరస్పర చర్చలు జరపాలని, అటువంటి సమావేశాలలో అందిన ఏవైనా సూచనలను చట్టపరమైన పద్ధతిలో ఖచ్చితంగా పరిష్కరించాలని ఈ నెల 31లోగ కమిషన్‌కు చర్య తీసుకున్న నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

# పిఠాపురం సభను జయప్రదం చేయాలి



**– జనసేన పార్టీ ఇంచార్జ్ సువర్ణరాజు**

**ద్వారక తిరుమల,మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం పిఠాపురం వద్దగల చిత్రాడ గ్రామంలో ఈనెల 14వ తేదీన జరగనున్న నేపథ్యంలో పార్టీ జనసైనికులు,వీర మహిళలు, విజయ వంతం చేయాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సువర్ణ రాజు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ విజయోత్సవ కార్యక్రమం విజయం కావాలని కోరుతూ ఆయన నేతృత్వంలో మండల జనసేన పార్టీ నాయకులు ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వారకాతిరుమల జనసేన పార్టీ కార్యాలయం వద్ద విజయోత్సవ పోస్టర్ను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, విజయోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరికి భోజనం టిఫిన్ తో పాటు బస్సు సౌకర్యం కూడా కల్పించడం జరిగింది అన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నేతృత్వంలో గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసైనికులు వీర మహిళలకు దిశా నిర్దేశం చేస్తూ విజయోత్సవ కార్యక్రమానికి వచ్చే వారికి కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను, పార్టీ విజయోత్సవాలతోపాటు రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాలను కూడా విజయోత్సవ కార్యక్రమంలో తెలిపే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు చిలుకూరు పని, సీనియర్ నాయకులు తరగళ్ల శ్రీనివాసరావు. జనసేన పార్టీ నాయకులుతోటకూర నాగేశ్వరరావు, మహంకాళి, గుండుగొలను కుంట శేఖర్, పవన్, కోడిగుడెం పార్టీ అధ్యక్షుడు శివ, సురేష్, పెద్దిరెడ్డి బాలాజీ,పి.కన్నాపురం పండు తదితరులు పాల్గొన్నారు.

### ఇరువురి మధ్య వ్యాపార లావాదేవీల రగడ



పాలకొల్లు,మేజర్ న్యూస్: స్థానిక బ్యాంకు వీధి నందు గల ఒక బ్యాంకు వద్ద కొంతమంది వ్యక్తులు ధర్నా నిర్వహించారు. గతంలో వ్యాపార లావాదేవీల నిమిత్తం ఒక వ్యక్తికి అన్యాయం జరిగిందని, బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగిని భర్త మోసం చేశాడంటూ ఆరోపణలు చేస్తూ భార్య పని చేస్తున్న బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో పట్టణ పోలీసులు,రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వారిని వెనుకకు పంపించారు.

### మహిళా దినోత్సవ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగుల కోసం క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులకు పురస్కారాలను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌ఘంటా పద్మశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న ఈ కాలంలో, వారి ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు మరింత ప్రోత్సాహకరంగా ఉండాలని, మహిళా సాధికారతకు ఇదొక మంచి వేదిక అని పేర్కొన్నారు. బహుమతి గ్రహీతలకు అభినందనలు తెలియజేస్తూ,ఈ తరహా కార్యక్రమాలు మహిళల అభివృద్ధికి మరింత ఉపయుక్తమవుతాయన్నారు. ఈ కార్యక్రమ ంలో జెడ్పి సిఈఓ కే.భీమేశ్వరరావు, మహిళా ఉద్యోగులు, ,అతిథులు పాల్గొన్నారు.

### మంత్రి అచ్చెన్నాయుడుతో జెడ్‌పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ భేటీ



**ఏలూరు,మేజర్‌న్యూస్** :రాష్ట్ర వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుని విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉండాలని జడ్పీ చైర్ పర్సన్ మంత్రిని కోరారు.

### చిన్న వెంకన్న ఆలయ సాయంకాల అర్చనలో మార్పు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయ సాయంకాల అర్చన సమయాన్ని మార్పు చేస్తున్నట్లు దేవాలయ ఈవోయన్ వి యస్ ఎన్ మూర్తి తెలిపారు. ప్రస్తుతం సాయంత్రం 5గంటల నుంచి గం 6:30 నిల వరకు సాయంకాలం జరుగుతుంది. ఈ నెల అనగా 14వ తేదీ శుక్రవారం సాయంత్రం నుంచి సూర్యస్తమయం కాల మార్పు అనుసరించి సాయంత్రం గం5:30నిల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహిస్తామని ఈ వో తెలిపారు. ఈ సమయంలో భక్తులకు స్వామివారి దర్శనం లభించిందన్నారు. కావున భక్తులు గమనించగలరు.

# సిఎం పర్యటన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలి





– జిల్లా కలెక్టర్ నాగరాణి,ఎమ్మెల్యే రాధాకృష్ణ,ఎస్పి అస్మి,వెంకటేష్

**తణుకు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తణుకు పట్టణంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 15వ తేదీన తణుకు రానున్న సందర్భంగా హెలి ప్యాడ్, పొలిటికల్ పార్టీ ప్రతినిధులు, జిల్లా అధికారులు సమావేశం కొరకు హాల్స్, ప్రజా వేదిక, స్టాల్స్ ఏర్పాటు, ఉమెన్స్ కాలేజీ వద్ద కూరగాయలు మార్కెట్ ప్రాంతాలను బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి,తణుకు శాసనసభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్,జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ నెల15 మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమాన్ని సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధం అనే స్లొగన్ తో నిర్వహించడం జరుగుతుందన్నారు. ముళ్ళపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నికల్ కాలేజ్ లో హెలిపాడ్, ఆడిటోరియం,జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాలలో పార్కింగ్ ప్రదేశం,జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్ నందు ప్రజా వేదిక, స్టాల్స్ ప్రదర్శన, స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఉమెన్స్ కాలేజ్ వద్ద కూరగాయలు మార్కెట్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాలలో అవసరమైన ఏర్పాట్లను యుద్ధ ప్రాతపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. తణుకు పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. హెలిప్యాడ్, బారికేడింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, తాడేపల్లిగూడెం,నరసాపురం ఆర్డీవోలు కతీబ్ కౌసర్ భానో,దాసిరాజు,డి.ఎస్.పి డి.విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ టి.రాంకుమార్,తహసిల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ,పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తులసీరాధ, హెడ్మాస్టర్లు కె.పద్మావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** జిల్లాలో ఆక్వా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అన్ని ముడి సరుకుల ధరలు దారుణంగా పెరగడం, నాణ్యత లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో ఉన్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరిని ఉదారంగా ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు బి బలరాం చెప్పారు. పాలకొల్లు సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెల వరకు కిలో రూ. 280 ధర ఉండేదని అయితే గత పక్షం రోజులుగా ధర తగ్గించుకుంటూ ప్రస్తుతం 230కు కొనుగోలు చేస్తున్నారని, ఇలా టన్నుకు 50 నుంచి 60 వేల రూపాయలు రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఒకవైపు ఫీడ్ ధరలు దారుణంగా పెరుగుతున్నాయని అయితే ముడి సరుకు ధర తగ్గిన ఫ్యాక్టరీలు తగ్గించడం లేదని ప్రభుత్వం ధరను నియంత్రించకపోవడంతో ఇష్టారాజ్యంగా ఉందని చెప్పారు. సీడ్ ధర కూడా నాణ్యత లేక రొయ్య రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం విద్యుత్ రాయితీ పేరుకే ఇస్తున్న ఇంధన,ట్రూ అప్ ,సర్వీస్ ఛార్జీలు రూపంలో మరో రూపంలో వసూలు చేస్తోందని చెప్పారు. ఆక్వా రైతు కష్టానికి ధర లేదని రుణాలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. ప్రకృతి




వైపరీత్యాలు కలిగినప్పుడు ఆదుకునే వారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో గిట్టుబాటు ధర కోసం ఆక్వా రైతులు ఆందోళన చేస్తున్నారని ఇది ఉధృతం కాక ముందే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాన్ని అందించిన ఆనాటి సిఎం జగన్

– ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు మండలంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం తాటాకుల గూడెం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంద ప్రసాద్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ బోధ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. వైయస్సార్ సిపి జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు సంద ప్రసాద్ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాన్ని అందించి అభివృద్ధిని చేసి చూపించిన నాయకుడిగా ప్రజల కొలుస్తున్నారని పేర్కొన్నారు.

నేడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వలన తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.కూటమిపాలనపై ప్రతి కుటుంబంలోనూ ప్రతి ఒక్కరు అసహనం పెంచుకున్నారని పింఛన్లు తప్ప ప్రజలకు ఏం ఒరిగిందని ప్రశ్నిస్తున్నట్లు చందా ప్రసాద్ ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారని జోశ్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు కక్కిరాల చక్రధర్, బిసి మండల అధ్యక్షులు చిట్టి బొమ్మ శ్రీనివాస్, నాయకులు బూరుగు ప్రేమ్ కుమార్,కుంజ చిన్న రాముడు,వంక రామకృష్ణ,నెరసు నరేంద్ర,గంధం బోసు, తగరం రాంబాబు, గంగుల రమేష్, మరలి రెడ్డి, బొంతు వెంకటరావు,గంధం చిన్న వెంకటేశ్వరరావు,ములకాల బాబు, ఆకుల రవి, కొప్పుల ప్రసాద్, మామిళ్ళ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతులలో ఉంది



**కైకలూరు,మేజర్ న్యూస్ :** కైకలూరు మండలం భుజబలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వశిష్ఠ ఆర్గనైజేషన్ వారు 10వ తరగతి విద్యార్థులకు మంచి ఫలితాలు పొందాలని ఆకాంక్షిస్తూ పరీక్షలకు సంబంధించి ఫ్యాడ్స్, పెన్నులు,మిఠాయిలు పంపిణీ చేశారు. సంస్థ ఫౌండర్ నడిపల్లి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు దేశం గర్వించే విధంగా గొప్ప మేధావులుగా ఎదగాలి దేశాభివృద్ధికి విద్య చాలా అవసరం సెల్ ఫోన్లవల్ల నష్టం ఉపయోగం వుంది కాబట్టి దానినుండి మంచినే తీసుకోవాలి అదేవిదంగా తల్లి తండ్రులు కూడా తమ పిల్లలను విద్య పరంగా ముందుకు తీసుకెళ్లే విధంగా పిల్లలకు దోహదపడాలి పిల్లల అప్పుడే పిల్లల భవిష్యతు బాగుంటుందన్నారు. దేశ భవిష్యతు విద్యార్థుల చేతులలో వుంది అన్ని రంగాలలో రాణించి ముందుకు వెళితే కన్న తల్లి తండ్రులకు సమాజానికి దేశానికి మంచి పేరు వస్తుంది. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రాజు,నడుపల్లి దేవి, పాఠశాల హెచ్ఎం లక్ష్మి రాజేశ్వరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌లో ఘనంగా విజయకుమార్ పుట్టినరోజు వేడుకలు



ముదినేపల్లి,మేజర్ న్యూస్ : ముదినేపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు వి.విజయకుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ నాగరాజు ఏలూరు జిల్లా ఏపీయుడబ్ల్యూజె యూనియన్ కార్యవర్గ సభ్యులు వి. విజయకుమార్ చేత బర్త్‌డే కేక్ కట్ చేయించారు. పాత్రికేయ వృత్తిలో 25 వసంతాలు ,ప్రెస్ క్లబ్ సభ్యుల సమస్యల పరిష్కారానికి యూనియన్ దృష్టికి తీసుకు వెళ్లడం వాటిని సాధించుకోవడం,సమాజ సేవకు అంకితమై మంచి వార్తలు వ్రాసి అందరి ప్రజా మన్ననలు పొందారు. సీనియర్ పాత్రికేయుడు విజయ్ కుమార్‌ను ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు భుజంగం,నందీశ్వరరావు ,సెల్వరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం యువజన విభాగంచే బ్లడ్ క్యాన్సర్ బాధితుడికి సాయం



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక హీరో షోరూమ లో పనిచేసే బొత్స శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.. వైద్యానికి అవసరమయ్యే హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం ఏలూరు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా టీమ్ ఆధ్వర్యంలో రూ. 45వేలు నగదు అందజేశారు. జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు,అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయబాబు,అర్బన్ జిల్లా యువజన సంఘం నాయకుల చే వారి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బ్లడ్ క్యాన్సర్ బాధితుడైన బొత్స శ్రావణ్ కుమార్ త్వరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘ నాయకులు లింగమల్లు సంతోష్ , బలబద్ర విశ్వనాథ్ ,చలువాది పవన్,కె.పవన్, చలువాది సూర్యనారాయణ, దోసగుంట్ల సత్యనారాయణ,ప్రశాంత్, గొల్ల శ్రీకాంత్, వెనవల్లి రాంప్రసాద్, పాదర్తి రవి, కంభంపాటి రామ్మోహన్ రావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# పూల సాగుపై దృష్టి సారించాలి





**– రైతులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచన**

**భీమవరం,మేజర్ న్యూస్:** జువ్వలపాలెం రోడ్డు ఆనంద ఇన్ హౌటల్ నందు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి పూలసాగు,ఉద్యాన విలువ ఆధారిత ఉత్పత్తులపై బుధవారం అవగాహన సదస్సులో రైతులకు శిక్షణ తరగతుల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.తొలుత పూల ప్రదర్శనను తిలకించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సింగపూర్, మలేషియా దేశాలతో పాటు,ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, రాయలసీమ, కడియం పూల సాగుకు ప్రసిద్ధిగాంచడం తోపాటు, అక్కడి రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారు అన్నారు. జిల్లాలో ఎక్కువ నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి పూల్ మకాన్ సాగుకు దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని పెనుగొండ, సిద్ధాంతం ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, అలాగే జిల్లాలో పువ్వుల సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి రైతులను అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ 19వేల హెక్టార్లలో పూల సాగు చేస్తూ 3వ స్థానంలో ఉన్నదన్నారు. జిల్లాలో ప్రస్తుతం పూల సాగును రైతులు తక్కువ స్థాయిలో చేపట్టడం జరిగిందని, మన జిల్లా వాతావరణం, నేలలు, పుష్కలమైన సాగునీరు పులసాగుకు అనువైనవన్నారు. ప్రభుత్వము పెద్ద ఎత్తున పూలసాగును ప్రోత్సహిస్తున్నదన్నారు. మన జిల్లాలో 2 లక్షల హెక్టార్లు సాగు భూమిలో 1.20 లక్షల హెక్టర్లు వరి సాగు ఉన్నది. 50వేల హెక్టార్లలో ఆక్వా చెరువులు ఉన్నాయని తెలిపారు. ఇతర వ్యవసాయ పంటలు పోను 15వేల హెక్టార్లలో మాత్రమే ఉద్యాన పంటల సాగు ఉన్నదన్నారు. తొలుత పూల సాగు పై కెవికె హెడ్ డా.మల్లికార్జున్, డైరెక్టర్ ఆఫ్ ఫ్లోరి కల్చర్ డాక్టర్ డివిఎస్ రాజు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.లలిత కామేశ్వరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు జిల్లాలో పూల సాగుకు ఉన్న అవకాశాలు, దేశ విదేశాల్లో మార్కెటింగ్ వంటివాటిపై కార్యక్రమంలో వివరించారు. ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్ దేవానంద్ కుమార్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వం రావు,నాబార్డ్ డీడీఎం టి.అనిల్ కాంత్,ఉండి కెవికె హెడ్ అండ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున్,కడియం మండలం వేమగిరి రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆఫ్ ఫ్లోరి కల్చర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డివిఎస్ రాజు, హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి, కొవ్వూరు హార్టికల్చర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.లలిత కామేశ్వరి, సైంటిస్ట్ డాక్టర్ వి.శివకుమార్, వేమగిరి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రాంపాల్, రైతులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రలో నో స్మోకింగ్ డే



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని సీతారాంపురం లో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో బుధవారం నో స్మోకింగ్ డే సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్, హెచ్ ఓ డి స్వామినాథన్‌లు మాట్లాడుతూ స్మోకింగ్ వల్ల ఆరోగ్యానికి సమాజానికి హాని కలుగుతుందన్నారు. స్మోకింగ్ చేయడం వల్ల క్యాన్సర్, టీ బి లాంటి అనేక వ్యాధులు వస్తున్నాయని యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. స్మోకింగ్ చేయడం వల్ల వాయు కాలుష్యం పెరిగి పక్క వారి ప్రాణాలకు కూడా హాని కలుగుతుందని అన్నారు. కళాశాల చైర్మన్ కె వి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విస్సా మాణిక్యాలరావు తదితరులు మాట్లాడారు.

# 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**– వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ కె.విజయానంద్ సమీక్ష**



**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే పదోతరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం ఎస్.ఎస్.సి పరీక్షలకు సంసిద్ధత, రాబోయే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కోసం సూచనలు, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం, సానుకూల ప్రజా అవగాహన, పి4 మోడల్ సర్వే, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు,ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షల నిర్వహణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు,ఇతర చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వణపై సోషల్ మీడియాలో ఎటువంటి రూమర్ల కు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 24, 25 తేదీల్లో నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు సంసిద్ధత కావాలన్నారు. ప్రతీ నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛఆంధ్ర దివాస్ కార్యక్రమాన్ని అర్ధవంతంగా నిర్వహించాలన్నారు. సానుకూల ప్రజా అవగాహన, పి4మోడల్ సర్వే, తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, వివిధ శాఖల జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వారు నిర్ధేశించిన అంశాలపై సమగ్ర నివేదికలను రూపొందించాలన్నారు. మార్చి 17 నుంచి మొదలయ్యే పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపివో వాసుదేవరావు, డిఈఓ వెంకట లక్ష్మమ్మ, డివిఈఓ ప్రభాకరరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు,డిసిహెచ్ఎస్ డా.పాల్ సతీష్,డ్వామా సుబ్బారావు , డిపివో కె.అనురాధ, ఆర్ టి సి డిఎం బి. వాణి,డిఎంహెచ్ఓ డా.ఆర్.మాలిని, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు వ్యాపారులు సహకరించాలి : పర్యావరణ డిఈ



**నరసాపురం, మేజర్ న్యూస్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించేందుకు వ్యాపారుల సహకరించాలని పర్యావరణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ కే వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ సభలో డీఈ మాట్లాడుతూ అనేక రోగాలకు కారణమైనటువంటి సింగల్ యూ జ్ ప్లాస్టిక్ నిర్మూలనకు వ్యాపారులంతా బాధ్యత వహించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు, మానవ మనుగడకు ప్రమాదకరంగా ఉన్న ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు దృష్టి సారించి ఎవరు కవర్లు అమ్మకుండా, కొనకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక షాపులలో తనిఖీలు నిర్వహించామని ఇక కవర్లు కనిపిస్తే కని కరించేది లేదన్నారు. ఈ సమావేశంలో వ్యాపారులతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాపు సంఘం ఆధ్వర్యంలో సత్కారం



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీ వైఎన్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గా నియమితులైన డాక్టర్ అందే రామ్ సతీష్,వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైన డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావులను వైఎన్ కాలేజీలో నరసాపురం నియోజకవర్గం కాపు కన్వీనర్ కోటిపల్లి సురేష్ ఆధ్వర్యంలో సత్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాపు సంఘం నాయకులు వారికి పూల బొకే ఇచ్చి సాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జి,మండల కాపు సంఘం అధ్యక్షుడు ఆడబల అయ్యప్ప నాయుడు. జిల్లా కాపు సంఘం నాయకుడు కావలి నాని,మాజీ కౌన్సిలర్ బల్ల వెంకటేశ్వరరావు, పులపర్తి ప్రతాప్, మాజీ సర్పంచ్ కోనప రెడ్డి రంగారావునియోజవర్గ కాపు సంఘం నాయకులు దేవి మూర్తి ,చినిమిల్లి వీరబాబు,కోటిపల్లి ఆనందరావు,సూర్య కళాశాలల అధినేత గంటసాల బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్:** మండలంలోని కన్నాపురం అటవీ శాఖా కార్యాలయం వద్ద గిరిజనులు ఆందోళన నిర్వహించారు. తన భర్త మడకం యాకోబు (రాజేష్)ను చిత్ర హింసలకు గురి చేసిన అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన భార్య డిమాండ్ చెసింది. అటవీ శాఖ అధికారులు కులం పేరుతో ధూషించి బూటు కాలితో తన్నడంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడి సమస్యని పరిష్కరించిన కొయ్యలగూడెం పోలీసులు.

# మహా బోధి బుద్ధగయను బౌద్ధులకు అప్పగించాలి

**– కలెక్టరేట్ ఎదుట భారతీయ బౌద్ధ మహాసభ నాయకుల నిరసన**



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక కలెక్టరేట్ వద్ద భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం బిఎస్ఐ ఆంధ్ర ప్రదేశ్ శాఖ నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్‌కి మెమోరాండం సమర్పించారు. 1949 బుద్ధగయ టెంపుల్ బి.టి యాక్ట్‌ను తక్షణం బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌బుద్ధగయ టెంపుల్ యాక్ట్ ను రద్దుచేసి బుద్ధగయ పరిపాలన నువ్వు కేవలం బౌద్ధ బిక్షువులకే అప్పజెప్పాలి. క్రైస్తవులకు పవిత్రమైన జెరుసలేము క్రైస్తవుల ఆధీనంలో ఉంది. హిందువులకు ఆరాధ్య దైవం అయిన వెంకటేశ్వర స్వామి ఆలయం బ్రాహ్మణుల ఆధీనంలో ఉంది. పవిత్రమైన మక్కా, ఇస్లాం సోదరుల ఆధీనంలోనే ఉంది. సిక్కుల పవిత్ర స్థలమైన గోల్డెన్ టెంపుల్ సిక్కుల ఆధీనంలోనే ఉంది. కానీ బౌద్ధులకు ఎంతో పవిత్రమైన బీహార్‌లోని మహాబోధి బుద్ధగయ హిందూమత అధిపతులైన బ్రాహ్మణుల ఆధీనంలోఉండటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ ఉద్యమం గత ఏడాది సెప్టెంబర్ 17 నుండి ప్రారంభమై ఈ నెల 12న దేశవ్యాప్త నిరసనగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట బౌద్ధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహాబోధి విహారం ప్రస్తుతం బౌద్ధులకు స్వేచ్ఛగా అందుబాటులో లేదని,బ్రాహ్మణ ప్రభావిత పాలన కొనసాగుతుందని,దీన్ని బౌద్ధ భిక్షువుల ఆధీనంలోకి తేవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారతీయ బౌద్ధ మహాసభ శాఖ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శనం,ప్రధాన కార్యదర్శి యారం శ్యామ్ కుమార్, కార్యదర్శులు పివి సుబ్బారావు,బేతాళ నాగరాజు, తాడేపల్లిగూడెం జిల్లా అధ్యక్షులు మెట్టు వెంకన్న, ఇతర సంఘ బాధ్యులు,జి. రాంబాబు, టివిఎన్‌వి ప్రసాద్, నూకపెయ్యి కార్తీక్, ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ, ఆఫీస్ బేరర్స్ అనిల్ కుమార్, పౌలు, నంబూరి రవి, టి. అఖిల్ దేవ్, బిఆర్టిఎస్ పూలే, పి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించాలి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



**ఏలూరు,మేజర్ న్యూస్:** రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో రొయ్యల రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్ గా మారి కొనుగోలు ధరలు తగ్గించి వేయడం వలన రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, తగిన దిగుబడులు కూడా రావడం లేదని చెప్పారు. గతంలో వనామి రొయ్యల ఫీడ్ ధర టన్ను రూ.45 వేలు ఉంటే ప్రస్తుతం లక్ష 5వేల రూపాయలకు పెరిగిపోయిందన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు కనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధరలు పెరగలేదన్నారు. 100 కౌంట్ రొయ్య ధర రూ.260 నుండి రూ.230, 50 కౌంట్ రూ.380 నుండి 350,40 కౌంట్ 420 నుండి రూ.360కి రొయ్యల ధరలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. పెరిగిన ఫీడ్ ధరలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుండపనేని సురేష్ పాల్గొన్నారు.

# ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం టౌన్ ప్రెసిడెంట్ అచ్చిత ఏసుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు కార్యకర్తలు కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఆర్చ్ గేటు వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రమంలో రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకటరావు, చిలుకూరి చంద్రశేఖర రావు, చెన్నూరు రామకృష్ణ, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం, దూలపల్లి ప్రసాద్, రామాయణం నాగ చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయాలని వైసీపీ ధర్నా





**భీమవరం,మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మేరకు బుధవారం భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పశ్చిమగోదావరి జిల్లా వైసిపీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో ఫీజు పోరు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాద్ రాజు, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. పది నెలలుగా ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. విద్యార్థులకు వెంటనే ఫీజు బకాయిలు, అదేవిధంగా ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కి వినతి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్చార్జి గూడూరి ఉమా బాల, టీవీ ఎల్ నరసింహారాజు,పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల గోపి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, గున్నం నాగబాబు,కామన బాల సత్యనారాయణ కాకిలేటి ఆనంద్ కుమార్ పప్పుల రామారావు, కోడెల్లి వెంకటరావు, మద్దా చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం



**కుక్కునూర్,మేజర్ న్యూస్:** మండల కేంద్రంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం కేకుకట్ చేసి పార్టీ శ్రేణులు కార్యకర్తలు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో తాండ్ర రాజేష్ ,రాయి రవీంద్ర ,రాయి సత్యనారాయణ రావు, వినోద్ , మల్లెల చంటి,తదితరులు పాల్గొన్నారు

## 15న ఏలూరులో సీడాప్ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో జాబ్ మేళా

**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల (స్కిల్ హబ్), సత్రంపాడు, ఏలూరు జిల్లా నందు ఈ నెల 15న శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.రజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్ నందు సంగీత మొబైల్స్, వేరియంట్ ప్రైమరీ స్కూల్, పెటిఎం కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే సుమారు 75 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ,డిగ్రీ,పి.జి వంటి విద్యార్హతలు ఉండి 18–30 సం.ల వయసు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 8978524022, 8143549464, (9988853335 – టోల్ ఫ్రీ) నంబర్స్‌కు సంప్రదించవచ్చన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయడేటా ,సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని తెలిపారు.

## రైలు ఢీకొని బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి



**ఏలూరు,మేజర్ న్యూస్:** జఢ్రిస్ అలం కిషన్‌గంజ్ గ్రామం బీహార్ రాష్ట్రంకు చెందిన వ్యక్తి ఏలూరులో పవర్ పేట లో బ్రిడ్జి వద్ద ఉన్న క్రాఫ్ట్ బజార్లో గాజుల వ్యాపారం చేస్తు ప్రమాద వశాత్తు బుధవారం రైలు ఢీకొని మరణించాడు. క్రాఫ్ట్ బజార్ ఎదురుగా ఉన్న రైలు పట్టాల వెంబడి బహిర్భూమికి వెళ్లే సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృత దేహంను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్ర పరిచారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైసిపి జెండా ఆవిష్కరణ



**లింగపాలెం,మేజర్ న్యూస్:** వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు బుధవారం లింగపాలెం మండలంలో చింతలపూడి వైస్సార్సీపీ కోఆర్డినేటర్ కంభం విజయ రాజు సూచనలతో వైస్సార్సీపీ 15వ వార్షికోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు కొఠారి మోహన్ రావు, పార్టీ సీనియర్ నాయకులు బివిఎస్ సోమిరెడ్డి, ముసునూరు వెంకటేశ్వరరావు, వేమవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మధు, రఘుబాబు,జిల్లా ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి నూతులపాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# పొలసానిపల్లి లో ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం





– పంచాయతీ సేవలు అభినందనీయమని పలువురి ప్రశంసలు

**భీమడోలు,మేజర్ న్యూస్:** గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో, క్రమ పద్ధతిలో పరిష్కరిస్తున్న పొలసానిపల్లి గ్రామపంచాయతీ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగవ వార్డ్ లో ప్రజలకు, రైతులకు సేవలు అందించేందుకు పుంత రోడ్డు. ఉంది. కాలక్రమేన సదరు రోడ్డు వివిధ కారణాలవల్ల దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా మారింది. దీనిపై సర్పంచ్ షేక్ రహీమా బేగం హసేన, ఇతర గ్రామ పంచాయతీ కార్యవర్గం స్పందించారు. పుంత రోడ్డును బాగు చేయడంతో పాటు దానిని ఆధునికరించే క్రమంలో గ్రావెల్ రోడ్డుగా మార్చేందుకు గ్రామపంచాయతీ నిధులు మంజూరు చేశారు. ఈ పనులకు బుధవారం గ్రామ సర్పంచ్ శంకుస్థాపన చేశారు. ప్రారంభమైన పనులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ, గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామపంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగం, అమ్మకాలను. నిషేధించామన్నారు.

ఇక తాగునీటి సమస్య విషయానికి వస్తే రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి బోరులను బాగు చేయుట, పాడైపోయిన పైపులైను మార్చుట,లీకేజీలు అరికట్టుట కార్యక్రమాలను. పూర్తి చేసామన్నారు. ఇదే క్రమంలో కొన్నిచోట్ల రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా వ్యవస్థ గేట్ వాల్వులు మట్టిలో కూలిపోయి పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగకపోవడం,కొన్నిసార్లు కలుషిత జలాలు కలవటం వంటి కార్యక్రమాలు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతాల్లో పటిష్టమైన గేట్ వాల్వ్ పిట్ రక్షిత నిర్మాణాలను పటిష్ట స్థాయిలో నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గంజి సుబ్బారావు, ఎం శ్రీనివాసరావు, వి గోవింద్ పాల్గొన్నారు.

# నాటు సారా కేసుల్లో ఇద్దరి అరెస్టు



**లింగపాలెం,మేజర్ న్యూస్ :** డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ , జిల్లా, ఏ.ఆవులయ్య ఆదేశాలు ప్రకారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెం గ్రామములో నాటు సారాయి స్థావరాలు పై దాడులు నిర్వహించారు. అన్నపనేనివారిగూడెం గ్రామము కు చెందిన రాచప్రోలు జానకి,బోగోలు గ్రామనకు చెందిన పాలగాని రాజేశ్వరి అను ఇద్దరు మహిళ వద్ద నుండి (10) లీటర్లు నాటు సారాయిను స్వాధీన పరచుకొని ,వారిరువురి పై నాటు సారాయి కేసు నమోదు చేశారు. అలాగే నాటు సారా కేసులో పరారీలో ఉన్న నిందుతురాలైన నక్కా వెంకమ్మను అరెస్టు చేసి చింతలపూడి మేజిస్ట్రేట్ వారి యాదుట హాజరు పరిచారు. ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు ఆర్.వి.ఎల్.నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్,సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి.ఐ. పి.అశోక్ తెలిపారు.

## లక్ష్మీపురం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ట 7వ వార్షికోత్సవం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి జిల్లా మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరిగి 6వ వార్షికోత్సవం పూర్తి అవుతున్న సందర్భంగా మార్చి 12 బుధవారం అంగరంగ వైభవంగా వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమి టీ వారు ఉదయం ఆంజనేయస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అంకురార్పణ, దీపారాధనలతో పూజలు నిర్వహించి, ఆలయ పూజా రి జక్కుల శంకర్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, రుద్ర సూక్తం, ఫల పంచామృతాలు, 14 రకాల ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకం, 108 కలశాలతో, తమలపాకులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదాలను, తదనంతరం ఆలయం కమిటీ వారిచే నిర్వహించబడిన అన్న ప్రసాదాలను స్వీకరించారు.

# మహానేత డాక్టర్ వైఎస్ ఆశయ సాధనే లక్ష్యం



**కైకలూరు,మేజర్ న్యూస్ :** మహానేత ఆశయ సాధనే లక్ష్యంగా విలువలు విశ్వసనీయతల పునాదులపై ప్రజలకు ఇచ్చిన మాటకోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యని 14 వసంతాలు ముగించుకుని 15వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ శుభ సందర్భంలో కష్ట సుఖాల్లో పార్టీకి అండగా నిలిచిన ప్రజలకు,పార్టీతో కలిసి నడిచిన నాయకులకు, పార్టీ వెన్నంటి ఉన్న కార్యకర్తలకు ధన్యవాదాలు ఏలూరు జిల్లా వైఎస్ ఆర్సిపి అధ్యక్షులు,దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరులోని సంత మార్కెట్లో గల వై.యస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైఎస్ ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవమును ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహనికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు,రాష్ట్ర అనుబంధం కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు ఆర్గనైజేషన్ సెక్రటరీలు, నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు,ఎంపీపీలు,మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు వైస్ చైర్మన్లు,మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు, మండల కో ఆప్షన్ సభ్యులు,సర్పంచులు,ఎంపీటీసీలు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు,కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# 2019లో ఆక్రమణ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లు క్రమబద్ధీకరణ

**ఏలూరు,మేజర్న్యూస్:** అభ్యంతరం కానీ ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని 2019 అక్టోబర్ 15లోపు ఇల్లు నిర్మించుకొని ఉన్న ఆక్రమణలను క్రమబద్ధీకరించుటకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కావున అర్హత గల ఆక్రమణదారులు వారిఇళ్ళను క్రమ బద్ధీకరించుటకు గ్రామ, వార్డు సచివాలయాలలో దరఖాస్తును ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవలసినదిగా తెలియజేసారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ ఏడాది డిసెంబర్ 31 చివరి తేదీ అని పేర్కొన్నారు.

# న్యాయంపై అన్యాయం గెలిచింది

: మాజీ డిప్యూటీ సిఎం కొట్టు



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో 15వ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయంపై అన్యాయం గెలిచింది తాత్కాలికమే, రానున్న రోజుల్లో తిరిగి వైయస్సార్సీపి అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం పరిచారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు తొమ్మిది నెలల కాలం అయినా ఎన్నికలనాటి హామీలు నెరవేర్చలేకపోయారని , విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ డబ్బులు వెంటనే చెల్లించి విద్యార్థుల జీవితాలను పాడుగాకుండా చూడాలని సూచించారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు పాల్గొన్నారు ముందుగా పార్టీ జెండాను మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు.

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తక్షణమే తొలగించండి

### ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశం

**పెదవేగి,మేజర్ న్యూస్ :** పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో బుధవారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. దుగ్గిరాల గ్రామంలోని పలు కాలనీల్లో ప్రమాదకర రీతిలో వేలాడుతున్న హై టెన్షన్ విద్యుత్ వైర్లను గుర్తించి సత్వరమే వాటిని తొలగించి ప్రజలకు ఎవరికీ కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కూడా ఎప్పటికప్పుడు ట్రీ కటింగ్ నిర్వహించాలని, పొలాల వద్ద, తోటల వద్ద ప్రమాధకరంగా వేలాడే ఉండే విద్యుత్ వైర్లను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని సరి చేయాలని, రైతులకు,గ్రామస్థులకు ఎలాంటి ప్రమాదం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా తక్షణమే విద్యుత్ వైర్లను సరి చేసే ప్రక్రియ చేపడతామని ఎవరికి ఎలాంటి ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు చేపడతామని విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్,గ్రామ సర్పంచ్ గుంజా క్రిస్టుమని మధు బాబు,ఉప సర్పంచ్ చింతమనేని గోపి సహ పలువురు కూటమి నాయకులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్కు అంతరాయం

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈనెల 13వ తేది గురువారం ఏలూరు 1వ పట్టణంలో గల కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో జనార్దనస్వామి రథోత్సవం ఊరేగింపు సందర్భంగా సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆపరేషన్ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో గల మెయిన్ బజార్, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జలవారి చెరువు ఏరియా,గడియార స్తంభం ఏరియా, కుండి సెంటర్, పెరుగుచెట్టు ఏరియా పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని అన్నారు. కనుక వినియోగదారులు సహకరించాలని అంబేద్కర్ కోరారు.

# ఉక్కు పరిశ్రమ రంగంలో స్థిరమైన అభివృద్ధికి ప్రణాళికలు





**– ఢిల్లీ వేదికగా ప్రోత్సాహకులకు ఆహ్వానం పలికిన కేంద్ర మంత్రి వర్మ**

**ఢిల్లీ /భీమవరం,మేజర్ న్యూస్:** ముడి ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో భారతదేశం రెండవ అతిపెద్ద దేశంగా అవతరించడం ఆనందంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన నూతన స్టీల్ సెక్టార్‌లో పరిశోధన మరియు అభివృద్ధి, స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఆర్టీఎంఐ) వెబ్–పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ ప్లాట్ ఫారమ్ ను కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ స్టీల్ పరిశ్రమ రంగంలో సాధించిన అభివృద్ధి గురించి చర్చించడం ఆనందంగా ఉందని అన్నారు. నూతన స్టీల్ సెక్టార్‌లో పరిశోధన మరియు అభివృద్ధి , స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఆర్టీఎంఐ) వెబ్–పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ ప్లాట్ ఫారమ్‌ను విజయవంతంగా ప్రారంభించడం ద్వారా ఉక్కు తయారీలో నూతన ఆవిష్కరణలు, స్థిరత్వం, సాంకేతిక పురోగతిని ప్రోత్సహించడానికి ప్రధాన మోదీ నాయకత్వంలో బలమైన పునాదిని వేశామని పేర్కొన్నారు.

పరిశ్రమ నాయకులు,విద్యా నిపుణులు, టెక్నాలజీ ప్రొవైడర్లు, స్టార్టప్‌లు వంటి వాటాదారులంతా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్టీల్ పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్, విద్యారంగం ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# పిఠాపురం సభకు భారీ జన సమీకరణ

**– జనసేన కార్యదర్శి బందెల రవీంద్ర**



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో శుక్రవారం నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ప్రభుత్వ విప్,స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో భారీ జన సమీకరణకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సహాయ కార్యదర్శి బందెల రవీంద్ర తెలిపారు. బుధవారం నరసాపురంలో ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడారు. జనసేన పార్టీ ఏర్పాటుచేసి 12 సంవత్సరాల అవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పవన్ కళ్యాణ్, చిరంజీవి, జనసేన పార్టీ అభిమానులను ఆవిర్భావ సభకు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పార్టీ నాయకులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రత్యేకంగా కలిసి ఆవిర్భావ సభ ప్రాధాన్యతను వివరించారు అన్నారు. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న ఈ సభకు ఎంతో ప్రాధాన్యత ఉన్నట్లు రవీంద్ర తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్యమైన నాయకులు కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బా రాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి మురళీకృష్ణాలతో సమావేశమై జన సమీకరణ,ఏర్పాట్లు, రవాణా తదితర విషయాలపై నాయకర్ చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గ నుండి బస్సులు, కార్ల ద్వారా పెద్ద ఎత్తున అభిమానులు ఈ సభకు హాజరయ్యేందుకు స్వచ్ఛందంగా సిద్ధపడుతున్నారని అన్నారు. ఇప్పటికే పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయకర్ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించి సభకు హాజరు అవ్వాలని కార్యకర్తలకు తెలిపారని అన్నారు.

# జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు నిధులు

**– కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి**
**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి**



**ఢిల్లీ/ ఏలూరు,సూర్య బ్యూరో :** ఏలూరు జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు సబ్ వేస్ లు, ఫ్లై ఓవర్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ హౌస్ మంత్రి చాంబర్ రోడ్ లోని కార్యాలయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ మహేష్ కుమార్ కలిసి వినతి పత్రం అందజేశారు.

**కొల్లేటికోటకు డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.109 కోట్లు ఇవ్వండి –**

గుండుగొలను నుండి పెద్దింట్లమ్మవారి దేవాలయం వరకు దాదాపు 24 కిలోమీటర్ల రహదారి కొల్లేరు సరస్సు ప్రాంతం నుంచి వెళ్తుందని, కొల్లేటిలంక గ్రామాలకు ప్రసిద్ధ పెద్దింట్లమ్మ అమ్మవారి దేవాలయానికి ఏడాది పొడవునా యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. ఈ రహదారిలో ప్రజలు, పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.109 కోట్లు మంజూరు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

**ఏడు బ్లైండ్ స్పాట్లు వద్ద ఫ్లై ఓవర్లు, సబ్ వేస్ నిర్మించండి –**

అలాగే భీమడోలు వద్ద రెండు కి.మీ ఫ్లైఓవర్ నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కూరెళ్లగూడెం వద్ద ప్రజలు ఇంటర్‌చేంజ్ క్రాస్ పాయింట్‌ను దాటి అవతలి వైపునకు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. అంబర్‌పేట, వడ్లపట్ల జెడ్పీ రోడ్డు నుంచి అంబర్‌పేట పొలిమేరపుంత వరకు 1200 మీటర్ల మేర ఫ్లై ఓవర్ నిర్మించాలని, పి.కన్నాపురం నుండి పుల్లకి ఇంటర్‌చేంజ్ పాయింట్ వద్ద 600 మీటర్లు రాంగ్ రూట్ లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఎంపీ మహేష్ కుమార్ కేంద్రమంత్రికి వివరించారు.

**– ఉంగుటూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మించండి –**రైళ్ల రాకపోకల వల్ల జరిగే ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుంటూ ఉంగుటూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర మంత్రుని కోరారు.

**– సీతంపేట వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి –**

దెందులూరు మండలం సీతంపేట జంక్షన్ వద్ద నాలుగు మీటర్ల ఎత్తు బాక్స్ కల్వర్టు, లేదా పీయుపీ/ సీయుపీ నిర్మాణంతో పాటు గుండుగొలను జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి, బాక్స్ కల్వర్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ కోరారు. ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## తమిళనాడు మంత్రి వజ్రవేలుతో ఎమ్మెల్యే చింతమనేని భేటీ



**దెందులూరు /విజయవాడ,మేజర్ న్యూస్ :** తాజా రాజకీయ అంశాలపై తెలుగుదేశం పార్టీ అధినాయకత్వంతో భేటీ కోసం తమిళనాడు లోని అధికార డీఎంకే పార్టీ ప్రతినిధిగా ఆంధ్రప్రదేశ్ చేరుకున్న తమిళనాడు క్యాబినెట్ మంత్రి ఎతిరాజులు వజ్రవేలుని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ క్యాబినెట్‌లో రహదారులు,పబ్లిక్ వర్క్స్, పోర్ట్స్ శాఖామంత్రిగా భాద్యతలు నిర్వహిస్తున్న ఈ.వి.వేలు మన తెలుగు మూలాలు కలిగిన కుటుంబంకి చెందినవారు కావడం గమనార్హం.

### హత్యాయత్నం కేసులో ముద్దాయికి 3ఏళ్ల జైలు శిక్ష : రూ.10 వేల జరిమానా

**ఏలూరు,మేజర్ న్యూస్ :** మొబైల్ కోర్ట్ మేజిస్ట్రేట్ ఎస్‌కె మహ్మద్ అబుతలిబ్ ఫర్విజ్ పెదపాడు పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 226/2020 324 అల్లైడ్ 326 ఐపిసి కేసులో ముద్దాయి అయినా సబ్బా గోవర్ధన్ అతనిపై నేరం రుజువైన నేపథ్యంలో 3 సంవత్సరలు జైలు శిక్ష, 10వేల రూపాయలు జరిమానా విధించారు.

– కేసు వివరాలు –2020 నవంబర్ 17వ తేదీ ఒంటిగంట సమయంలో ఫిర్యాదు తమ్ముడు శివరామకృష్ణ పొలం పెల్లి నీళ్లు పెట్టి వస్తానని చెప్పి వెళ్లినట్లు అదేరోజు మధ్యాహ్నం ఆ గ్రామానికి చెందిన రైతు కట్ట వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు పొలం వైపు నుండి ఊళ్లోకి వస్తుండగా పొలం గట్టుపై ఫిర్యాది తమ్ముడు శివరామకృష్ణ గాయాలతో పడి ఉండడం చూశాడు. వెంకటేశ్వరరావు ఫిర్యాదుకి సమాచారం అందించిన దానిపై ఫిర్యాది,కొంతమంది వెంటనే పొలం దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ ఫిర్యాది తమ్ముడు తలపై ఎడమ చేతిపై రక్తపు గాయాలతో స్పృహ లేకుండా పడి ఉన్నట్లు అంతట ఫిర్యాది వాకబు చేయగా ఫిర్యాది సరిహద్దు పొలం రైతే నా సబ్బా గోవర్ధన్ పొలానికి నీళ్లు పెట్టుకునే విషయంలో ఫిర్యాదు తమ్ముడు తో గొడవపడి చేతి కర్రతో ఫిర్యాది తలపై విచక్షణ రహితంగా కొట్టి కత్తితో ఫిర్యాది తమ్ముడు ఎడమ చేతిపై వేళ్ళపై నరికినట్లు తెలిపారు. ఈ విషయం వెంటనే పెదపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వెంటనే అప్పటి ఎస్ఐ జ్యోతి బాసు కేసు నమోదు చేసి కేసులో దర్యాప్తును చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో వాదోపవాదాలను కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత వినిపించగా ముద్దాయికి న్యాయస్థానం శిక్ష విధించారు. ఈ కేసులో పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీష్ ,కోర్ట్ కానిస్టేబుల్ వి పవన్ కుమార్, సాక్షులను సకాలంలో న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టి సాక్ష్యం ఇప్పించిన దానిపై అధికారులు పోలీసులను అభినందించారు.

### పలు శుభకార్యాల్లో పాల్గొన్న దేశం నేత నాయుడు



**నరసాపురం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు బుధవారం బిజీబిజీగా గడి పారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలు, దేవాలయ శంకుస్థాపనలు, పునః ప్రతిష్ట, వై ఎన్ కళాశాల పాలకవర్గ ప్రమాణ స్వీకారం తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గానికి చెందిన వివిధ కుల సంఘాల నాయకులు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురం, మొగల్తూరు, లక్ష్మణే శ్వరం, రామన్నపాలెం, గ్రామాల్లో జరిగిన శుభకార్యాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.